క్లుప్తంగా

బోడికొండపై విత్తనాలు చల్లే కార్యక్రమం



విత్తనాలు చల్లుతున్న దృశ్యం

పెనుకొండ: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో స్థానిక సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ నిర్వాహకులు బోడి కొండల్లో విత్తనాలు చల్లే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఈద్గా నుంచి బోయగేరి, కొండంపల్లి వరకు ఉన్న బోడి కొండల్లో ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి, ఇతర నాయకులు వేప, కానుగ, భోద తదితర విత్తనాలను చల్లించారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



అశ్విన్ ఆరాధ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురంలోని ముద్దిరెడ్డిపల్లిలో వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు వాల్మీకి లోకేష్ కుమారుడు అశ్విన్ ఆరాధ్య విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలిసిందే. బెయిలుపై విడుదలైన లోకేష్ కుమారుడి కోసం సమారాధన నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం వైఎస్సార్ సీసీ నాయకుడు వేణురెడ్డి లోకేష్ ఇంటికి వెళ్లి అశ్విన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లోకేష్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌ఎ శివ, మీడియా కోఆర్డినేటర్ ప్రణయ్, దిలీప్ పలువురు నేతలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్ సైదా

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. చిత్రదుర్గం నుంచి వచ్చిన స్త్రీల వ్యాధి నిపుణురాలు డాక్టర్ జ్యోతి 150 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. పావగడ నుంచి వచ్చిన సామాన్య వ్యాధి నిపుణుడు ఓంకార్ నాయక్ 60 మంది రోగులను పరీక్షించారు. హిందూపురం నుంచి వచ్చిన కంటి వైద్యురాలు సైదా 120 మంది రోగులను పరీక్షించారు. అందులో కంటి చూపు మందగించిన 35 మంది రోగులను శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి సోమవారం హిందూపురంలోని సాయి నేత్రాలయం ఆధ్వర్యంలో జింకా కృష్ణమోహన్ ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తారని కూటమి సభ్యులు డాక్టర్ బసవరాజు, పద్మరాజ్ జైన్, శ్రీనివాసమూర్తి తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు వలంటీర్లు, కూటమి సభ్యులు రమేష్, అజయ్, శ్రీనివాస్, సిద్దేశ్వర, మంజునాథ, తిప్పేస్వామి తదితరులు సహకారం అందించారు.

కొబ్బరిచెట్టుపై పిడుగు



పిడుగు పాటుకు గురైన కొబ్బరి చెట్టు

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడగు గ్రామంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం కురిసింది. ఆ సమయంలో రైతు నరసింహప్ప ఇంటి పెరట్లోని కొబ్బరి చెట్టు స్వల్పంగా పిడుగుపాటుకు గురైంది.

వంతెన ఎప్పుడు నిర్మిస్తారో?



ఇరిగేపల్లికి వెళ్లేదారిలో కూలిన వంతెన

అగళి: మండలంలోని అగళి–ఇరిగేపల్లి మార్గంలో సువర్ణముఖి వంకపై నిర్మించిన వంతెన కూలిపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. వంతెన దెబ్బతిని పదహారు నెలలు గడుస్తున్నా కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. తాత్కాలికంగా నిర్మించిన డైవర్షన్ రోడ్డు వర్షాకాలంలో నీటితో మునిగిపోతే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అగళి నుంచి ఇరిగేపల్లి, నందరాజున పల్లి తదితర గ్రామాలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. అధికారులు ప్రజా ప్రతినిధులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు..



చేనేపల్లి- నల్లరాళ్లపల్లి మధ్య కోతకు గురైన రోడ్డు

చిలమత్తూరు: మండలంలోని నల్లరాల్లపల్లి సమీపంలో చేనేపల్లి– నల్లరాళ్లపల్లి ప్రధాన రహదారి కుషావతి నది సమీపంలో రోడ్డు కోతకు గురైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత దెబ్బతినింది. మలుపు కూడా ఉండటంతో వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ప్రమాదకరస్థాయిలో ఉన్న రహదారిని వెంటనే మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా బావి



బేగార్లపల్లికి వెళ్లే రహదారిలోని తబావి

మడకశిరరూరల్: పట్టణ పరిధిలోని బేగార్లపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలో రోడ్డుకు ఆనుకుని ఉన్న వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు రాత్రి సమయంలో బావి వద్ద ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. భారీ వాహనాలు వస్తే ఎదురుగా వచ్చే వాహనదారులు బావి వద్ద నిలిపి.. ఆ వాహనాలు వెళ్లిన తర్వాత వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గతంలో బావి వద్ద ప్రమాదాలు సైతం చోటు చేసుకున్నాయి. సంబంధిత శాఖ అధికారులు బావి వద్ద సైడ్‌వాల్ ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని వైఎస్సార్‌సీపీ సమన్వకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని చిగతుర్పి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ అభివృద్ధి, శ్రేయస్సు కోసం అంబేడ్కర్ ఎన్నో సహాయ సహరాలు అందించి మహోన్నతమైన శక్తిగా ఎదిగారని తెలిపారు. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం కల్పించిన హక్కులు సక్రమంగా అందుతున్నాయి అంటే దానికి మూల కారణం అంబేడ్కర్ అని కొనియాడారు. అనంతరం ఈరలక్కప్పను దళితులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కూడా అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు హాజరయ్యారు. కార్యక్రమంలో రొళ్ల, గుడిబండ జెడ్పీటీసీలు అనంతరాజు, భూతరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి విద్యార్థిని ఎంపిక



విద్యార్థిని స్వాతి బాయిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని స్వాతి బాయి జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం కళాశాలలో విద్యార్థినిని అభినందించి ప్రశంసా పత్రం అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం బెలగావిలో ఉన్న రాణి చెన్నమ్మ విశ్వవిద్యాలయంలో ఈ నెల 19 నుంచి 24 వరకు వారం రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు స్వాతి బాయి ఎస్కే యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ విభాగం తరఫున ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపికైందన్నారు. ఆంధ్రప్రదేశ్ జట్టు రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలపై వివిధ ప్రదర్శనలు ఇవ్వనున్నదని చెప్పారు. స్వాతి బాయి 'యువతలో ఉండాల్సిన సేవా దృక్పథం యొక్క ప్రాధాన్యత' వ్యక్తిత్వ వికాసం పై శిబిరంలో వివరించనున్నదని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినిని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, అధ్యాపకులు రమేష్, భోజప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు. జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికైన పదిమంది విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రగతి ఎన్‌ఎస్‌ఎస్ క్యాప్‌లను బహూకరించారు.

మూర్ఛ బాధితులు జాగ్రత్తలు పాటించాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ రామ్మూర్తి

హిందూపురం: మూర్ఛ వ్యాధిగ్రస్తులు వేగంగా తిరిగే యంత్రాల వద్ద జాగ్రత్తలు పాటించాలని వీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి సూచించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అల్‌హిలాల్ స్కూల్‌లో ఉచిత మూర్ఛ వ్యాధి శిబిరం జరిగింది. ఈసందర్భంగా 149 మంది రోగులకు పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడా మందులు ఉచితంగా అందించారు. ఈసందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మూర్ఛవ్యాధిగ్రస్తులు అపోహలు విడనాడి దీర్ఘకాలికంగా మందులు వినియోగిస్తూ వైద్యుల సలహాలు పాటిస్తే వ్యాధి నయమవుతుందన్నారు. వ్యాధిగ్రస్తులు వివాహం, ఉద్యోగం, సంసారానికి అర్హులు కారని చెప్పడం అపోహలేనన్నారు. కొన్ని విషయాల్లో కొంత అప్రమత్తత అవసరమన్నారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు రామకృష్ణ, లక్ష్మీపతి, ఉగ్రప్ప, నాగేంద్రచారి, లక్ష్మీపతి,అబ్దుల్‌హక్, నాగరాజుగుప్త, విశ్వనాథచారి తదితరులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరుడు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి గ్రామంలో వెలసిన సిద్ధేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు.

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపంలో అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూల ప్రతిమను అర్చకుడు గంగాజలంతో శుద్ధి చేసి అభిషేకం చేశారు. అనంతరం వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదం అందించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

కక్షతోనే మాజీ అధికారుల అరెస్టు



మాట్లాడుతున్న టీఎస్ దీపిక

చిలమత్తూరు: కూటమి ప్రభుత్వం కక్షపూరితంగానే మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్ చేశారని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎస్ దీపిక విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆమె అక్రమ కేసులు, అరెస్టులను ఖండిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ తప్పుడు వాంగ్మూలాలు సృష్టించి దురుద్దేశపూర్వకంగానే గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులను అరెస్టులు చేస్తున్నారని దుయ్యబట్టారు. లిక్కర్ కేసుల్లో కావాలనే ఇరికిస్తున్నారని, కేసులు, వేధింపులతో వైఎస్సార్‌సీపీ నేతలు, ఎలాంటి సంబంధం లేని అధికారుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. ఇలాంటి చర్యలు సీఎం చంద్రబాబు, లోకేష్ మానుకోవాలని హితవు పలికారు. కుట్రలు, కుతంత్రాలు, అక్రమాలు, అన్యాయాలు 2014 లోని టీడీపీ ప్రభుత్వం, ఇప్పుడు కూటమి ప్రభుత్వాల్లోనే చూస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వాన్ని నడిపిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నేరుగా ఎదుర్కోలేక ఆయన వద్ద పనిచేసిన వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై కూడా మళ్లీ కేసులు పెట్టి బెయిల్‌పై రాకుండా అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, కుట్టు మిషన్ల శిక్షణ, పంపిణీల్లో కూటమి ప్రభుత్వం చేసిన అవినీతి ప్రజలందరికీ తెలుసునన్నారు. సంక్షేమ పథకాలు అమలు మరచి ప్రజాధనాన్ని ఇష్టారీతిన దోచుకుంటున్నారని మండిపడ్డారు. ఈ ప్రభుత్వానికి కాలం చెల్లిందని తమ సమయం వచ్చినప్పుడు అక్రమార్కుల పనిపడతామని హెచ్చరించారు.

ఘనంగా గుడ్డం రంగనాథుడి గిరి ప్రదక్షిణ



పూలరథంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు

హిందూపురం: పట్టణంలోని గుడ్డం రంగనాథ స్వామి ఆలయ గిరిప్రదక్షిణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం మూలవిరాట్ రంగనాథస్వామికి పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేషంగా పుష్పాలంకరణతో అర్చనలు, పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామి ఉత్సవ మూర్తులను పూలరథంలో కొలువుదీర్చి పూజలు చేసి భక్తులు గోవిందా నామస్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ చేపట్టారు. అనంతరం మంగళ హారతులిచ్చి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నాగేంద్ర, అర్చకులు గోవిందశర్మ, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు

పెనుకొండ రూరల్: భారీ వర్ష సూచన కారణంగా రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా ఉన్న ప్రజల సౌకర్యార్థం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూంను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఆర్డీఓ ఆనందకుమార్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అత్యవసర పరిస్థితులలో 90594 17612 నంబర్‌ను సంప్రదించడం ద్వారా సాయం పొందవచ్చు.

చిలమత్తూరులో భారీ వర్షం

చిలమత్తూరు: మండల వ్యాప్తంగా శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. గాలి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసే రైతులకు మేలు చేకూరనుంది. కాగా మండల కేంద్రంలో 18.2 వర్షపాతం నమోదైనట్లు అధికారులు ప్రకటించారు.

ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	33.0
పెనుకొండ	36.0
మడకశిర	33.0

రొద్దకాంబ ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తుడు

రొద్దం: స్థానిక పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రొద్దకాంబదేవి ఆలయ నిర్మాణానికి ఆదివారం పలువురు భక్తులు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు. రొద్దం బీసీ కాలనీకి చెందిన యశోదదేవి, మదన్‌మోహన్ రూ.11వేలు, అంజినమ్మ, టైలర్ రామకృష్ణ దంపతులు రూ.5 వేలు, బెంగళూరు ఇట్టుమడుగుకు చెందిన జీవిత, వేణుగోపాల్ దంపతులు రూ.5 వేలు, బెంగళూరుకు చెందిన శైలజ, ఆదిమూర్తి రూ.5 వేలు, శారదమ్మ, నారాయణప్ప రూ.3 వేలు విరాళాలు అందజేసినట్లు వివరించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే అర్జీలు అందజేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. హాజరు కాని అధికారులకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మెమో జారీ చేస్తామని హెచ్చరించారు.

అక్రమాలకు ఉపాధి

- యంత్రాలతో ఉపాధి పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు
- దొంగ మస్టర్లతో బురిడీ
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- పట్టించుకోని అధికారులు



జేసీబీతో ఫారంపాండ్ పనులు చేయిస్తున్న దృశ్యం

అగళి: ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఉపాధి సిబ్బంది అక్రమాలకు పాల్పడుతుండటంతో పథకం ఉద్దేశం నీరుగారిపోతోంది. గ్రామీణ ప్రజలకు పనులు లేని సమయంలో వలసలు నివారించడానికి ఉన్న ఊళ్లోనే ప్రతి కుటుంబానికి ఏడాదికి 100 రోజుల పని కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి శ్రీకారం చుట్టింది. అయితే కూలీలకు ఉపాధి పనులు కల్పించాల్సిన అధికారులు యంత్రాలతో పనులు చేయిస్తూ కూలీల నోట్లో మట్టికొడుతున్నారు. క్షేత్ర స్థాయిలో ఎలాంటి పనులు చేపట్టకపోయినా.. అధికారులు, సిబ్బందికి మామూళ్లు అందితే చాలు అంతా బాగుందని ధ్రువీకరించి మమ అనిపిస్తున్నారు. ఆకస్మిక తనిఖీలు లేకపోవడంతో అధికార పార్టీ పేరు చెప్పి ఫీల్డ్ అసిస్టెంట్లు దండుకుంటున్నారు. బోగస్ మస్టర్లు వేసి నిధులు తమ ఖాతాలకు మళ్లించుకుంటున్నారు. ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు ఎన్ని విధానాలు ప్రవేశ పెడుతున్నా.. వీరి దోపిడికి మాత్రం అడ్డుకట్టు పడటం లేదు.ఆన్‌లైన్‌లోని లోసుగులను ఆసరాగా తీసుకుని దొంగ మస్టర్లు, బోగస్ హాజరుతో నిధులు స్వాహా చేస్తున్నారు. పని ప్రదేశం నుంచి కూలీల ఫొటోలను మస్టర్‌తో కలిపి ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది. అయితే ఒక చోట తీసిన ఫొటోలనే మరో మస్టర్‌కు వాడుతున్నారు.

యంత్రాలతో పనులు..

మండలంలోని 11 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను జేసీబీ యంత్రాలతో చేయించినట్లు నిర్ధారణ అయ్యింది. మధూడి పంచాయతీలోని మాధుడి గొల్లహట్టి గ్రామం, హళ్ళికెర పంచాయతీ, అగళి పంచాయతీ, ఆర్‌జీ పల్లి పంచాయతీలోని హనుమనపల్లి గ్రామం, ఆర్‌జి పల్లి, హెచ్‌డీ హళ్లి పంచాయతీలో రాత్రి పూట ఫారంపాండ్ పనులను జేసీబీలతో చేయించి బిల్లులు చేయించినట్లు సమాచారం. రాత్రికి రాత్రే యంత్రాలతో పనులు చేసి బిల్లుల కోసం మస్టర్లను సిద్ధ చేస్తున్నారని తెలియడంతో కూలీలు నివ్వెరపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. పనులకు వచ్చే కూలీల పేర్లను మాత్రమే మస్టర్‌లో నమోదు చేసి వారి ఫొటోలనే అప్లోడ్ చేయాలి. ఎవరైనా బోగస్ మస్టర్లను నమోదు చేసినట్లుగా గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

– లక్ష్మీనారాయణ, ఏపీడీ

అధికారులకూ వాటాలు..

ఉపాధి హామీ సిబ్బంది మస్టర్లలో హాజరు వేసిన కూలీల్లో 50 శాతం మంది మాత్రమే క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారు. మరో 50 శాతం కూలీల పేరిట బోగస్ హాజరు వేస్తున్నారు. చాలా గ్రామాల్లో సగటున రోజుకు 20 మంది హాజరవుతుంటే మరో 20 మంది ఫీల్డ్ అసిస్టెంట్ల కుటుంబ సభ్యులు, బంధువుల పేర్లు నమోదు చేస్తున్నారు. కూలీల ముఖచిత్రాలు తీయడం లేదు. పనులకు వెళ్లని వారి జాబ్ కార్డులు తీసుకుని వారికి హాజరు వేస్తున్నారు. ఖాతాల్లో జమ అవుతున్న వేతనాలను ఫీల్డ్ అసిస్టెంట్లు, జాబ్ కార్డుదారులు సగం సగం పంచుకుంటున్నారు. సంబంధిత అధికారులు, సిబ్బందికి కూడా వాటాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వైభవంగా వీరాంజనేయస్వామి శోభాయాత్ర



అలంకరణలో వీరాంజనేయ స్వామి



భక్తుల మధ్య సాగుతున్న శోభా యాత్ర

పావగడ: తాలూకాలోని భీమనకుంటె గ్రామంలో ఆదివారం వీరాంజనేయ స్వామి శోభాయాత్ర వైభవంగా సాగింది. హనుమజ్జయంతి పురస్కరించుకుని నిర్వహించిన హనుమంతుడి శోభాయాత్రను తిలకించడానికి వందలాది మంది భక్తులు, గ్రామస్తులు తరలి వచ్చారు. భక్తులు డప్పులు వాయిస్తూ ఆంజనేయస్వామి భక్తిగీతాలు ఆలపించారు. భజన చేశారు. అంతకు ముందు ఆలయంలో సుప్రభాత సేవ, యాగశాల ప్రవేశం, ఆంజనేయ స్వామికి కుంబాభిషేకం చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వేద పండితులు హోమాలు నిర్వహించారు.

'సర్వేలో చలవాది అని రాయండి'



కరపత్రాలు విడుదల చేస్తున్న చలవాది సంఘం నాయకులు

పావగడ: రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న ఎస్సీ సామాజిక వర్గ జనాభా సర్వేలో తమ కులం చలవాది (మాల) అని రాయాలని చలవాది సంఘం జిల్లా అధ్యక్షుడు భాను ప్రకాష్ కోరారు. ఆదివారం స్థానిక అతిథి గృహంలో చలవాది సంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా సర్వే అధికారులు కులగణన సమాచారం ప్రజల మొబైల్‌కు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. తాలూకా చలవాది సంఘం అధ్యక్షుడు కేటీ నాగరాజు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చలవాది సామాజిక వర్గం యువకులు కుల గణన సమయంలో కులం పేరు చలవాది అని రాయించుకునేలా కులస్తులను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో చలవాది సంఘం నాయకులు ఆదినారాయణ, రాజేంద్ర, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హరికథ గానం

పెనుకొండ: స్థానిక లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం అన్నమాచార్య కీర్తనలు, హరికథా గానం జరిగింది. టీటీడీ ప్రాజెక్టు సహకారంతో ఏర్పాటు చేసిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.